అమెరికా తెలుగుసంఘం - అమృతకిరణ్ కథలపోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ

# గడపదాటిన సుధన్య

-జి.ఆర్.ఎన్. టాగోర్.



చెమటలు కక్కుకుంటూ ప్లాట్‌ఫారం చేరుకుంది సుధన్య. అదృష్టం బాగుంది. తానిక్కడికి రావటం ఎవరికంటా పడలేదు హమ్మయ్యా! గట్టిగా ఊపిరి పీల్చి వదిలింది.

స్టేషను నిర్జనంగా ఖాళీగా ఉంది. రోజుకి ఒకసారి మాత్రమే ఇటూ అటూ వెళ్ళే పాసంజరు ట్రైన్లు నిలబడతాయా స్టేషన్లో. ఉరుకులు, పరుగులూ లాంటి నడకతో, విడివడిగా ఒకచేత్తో ఎయిర్ బ్యాగ్, మరో చేత్తో సూట్‌కేసు పట్టుకుని ఇంతదూరం ఎలా రాగలిగిందో తనకే ఆశ్చర్యం.



చేతివాచ్ చూసుకుంది. సాయంత్రం ఏడుగంటలు కావస్తున్నది. సూర్యాస్తమయానికి ముందుగానే చీకట్లను పులుముకున్న మర్రిచెట్టు నీడకు కృష్ణపక్ష చంద్రుని అంధకార విద్యాసాలు మరింత చీకటిని అద్దిపెట్టాయి.

వదిలివెడుతున్న వర్షాకాలానికి, రాబోతున్న చలికాలానికి సయోధ్యలా చిరుమేఘాలు చీకటి ఆకాశాల మీద సంతకాలు పెట్టుకుంటూ వెడుతున్నాయి ఎవరు చూడాలనో!

సుధన్య మాత్రం తననెవరూ చూడలేదని మరోసారి నమ్మకం కలిగించుకుంది. మరో దీర్ఘ విశ్వాసకూడా వదిలింది.

"పాసెంజరు ఎన్నిగంటలకు వస్తుంది?" పక్కగా వెళుతున్న పోర్టర్ని అడిగింది మెల్లగా సుధన్య.

"రెండు గంటలు లేటు" అన్న జవాబు సుధన్య గుండెల్లో రైళ్ళు పరిగెత్తించింది.

ఈ నీరవ నిశ్శబ్దంలో ప్లాట్‌ఫారం మీద ఒంటరిగా ఇంకా రెండున్నర గంటలు ఉండాలంటే భయం వేసింది.

ఏకాంతంగా ఉన్న తనను ఎవరన్నా చూస్తే ఏమవుతుంది? అమ్మో! తలచుకుంటేనే భయంవేసింది. తన జీవితంలాగే ఉన్న ఒంటరి ప్లాట్‌ఫారం తనతో మరిన్ని భయాల్ని రేకెత్తించింది.

రెండు సంవత్సరాల క్రితం హృదయంనిండా ఆశలు నింపుకుని, తన భర్తచేతిని ఆసరాగా తీసుకుని నవ వధువుగా ఈ గ్రామానికి వచ్చింది. భర్త ఒక స్వచ్ఛంధ సేవా సంస్థలో ఫీల్డ్ ఆఫీసర్, ఆ సంస్థకు ధనసహాయం విదేశాలనుండి వస్తోంది.

మాంఛి జీతం, పెద్దలంటే భక్తి గౌరవాలు కలవాడు

తన భర్త. సాధారణంగానే పెళ్ళీడు కొచ్చిన అమ్మాయిలున్న తల్లిదండ్రులు పోటీపడి ఎగబడ్డారు ఈ సంబంధం చేసుకోవాలని.

అన్ని మధ్యతరగతి కుటుంబాలలో లాగానే సుధన్య జీవితంలో కూడా అలానే జరిగింది. "వెంటనే తాంబూలాలు పుచ్చుకోండి, అయిదు పదివేలు ఇటై అటూ చూసుకోకండి, మంచి సంబంధం తప్పిపోతే పిల్లకి పెళ్ళవటం కష్టం" ఇలా పెద్దలు.

బంధువులూ, పెళ్ళిళ్ళ పేరయ్యలూ అఘమేఘాల మీద పరుగులు తీస్తూ సంప్రదింపులు జరుపుతూ ఉంటే, అప్పుడప్పుడే యుక్తవయసులోని అందాలను ప్రోది చేసుకుంటున్న సుధన్య తనదంటూ ఒక అభిప్రాయాన్ని వ్యక్తపరిచేలోపే, ఆమె అభిప్రాయాన్ని అడగాలన్న ఆలోచనలేరాని పెద్దమనుషులు పెళ్ళి జరిపించేశారు.

చివరికి... ఇదిగో, ఇలా నీవర నిశ్శబ్దంలో ఒంటరి ప్లాట్‌ఫారం మీద ఏకాకిగా నిలబడి పోయింది.

హఠాత్తుగా వచ్చిన చిరుగాలి వచ్చినంతవేగంగానూ గుండెల్లో చలిని కుదిపి పారిపోయింది. సుధన్య పైట భుజాల మీదుగా నిండుగా కప్పుకునిచేతుల్ని గుండెలకు దగ్గరగా మతం వేసుకుంది. ఒకసారి స్టేషన్ని పరిసరాల్ని పరికించి చూసింది.

భర్త టూర్ నుండి ఇంటికి తిరిగి వచ్చేటైం దగ్గర పడుతున్నది..లేక వచ్చేశాడో, వస్తూనే ఎదురుగా భార్య కనబడక పోయేసరికి మొదట విసుక్కుని తరువాత చిరాకు పడతాడు.

పల్లెటూరు కావడంతో ఇరుగూ పొరుగూ తలుపులు బిడాయించుకుని ఉంటారు. పొరుగిళ్ళ తలుపు తట్టి వాకబుచేస్తే కాస్త కాలం ఖర్చవుతుంది.

అలాకాక తిన్నగా పోలీస్ స్టేషన్‌కి వెళితే జరగబోయేది అనర్ధమే. మొగుణ్ణి వదిలేసి పారిపోతున్న ఆడది పోలీసులకు దొరికిపోతే అమ్మో! సర్వనాశనమే. ఏదో తెలియని బతుకు గుండె మారుమూలల్లో నుండి వుబుకుతూ వుంటే భయంతో గజగజలాడిపోయింది సుధన్య.

స్టేషన్ మెయిన్ గేటులోంచి ఎవరో ప్లాట్‌ఫారం మీదకు వచ్చారు దూరం నుండి తన భర్తలాగానే కనిపిస్తున్నాడు.


ప్లాట్‌ఫారం నాలుగు వైపులా పరిశీలనగా చూస్తున్నాడు. తెల్లచొక్కా, గోధుమరంగు ప్యాంటు వేసుకున్న అతను తన భర్తేనేమో అన్న అనుమానం సుధన్య మనసులోరేగి గుండె గబగబా కొట్టుకుంది.

మరికొద్ది క్షణాలలో వెనుక ఎవరో స్త్రీ. వాళ్ళిద్దరూ ఏదో మాట్లాడుకుంటున్నారు. హమ్మయ్య! తనభర్త కాదు వాళ్ళిద్దరూ తనవైపు రాకపోతే మరింత రక్ష అనుకుంది సుధన్య.

వాళ్ళిద్దరూ భార్యాభర్తల్లాగానే ఉన్నారు. మెయిన్ గేటు పక్కనే ఉన్న బెంచీ మీద కూర్చున్నారు. దగ్గర దగ్గరగా కూర్చున్నారు. ఆమె అతని చేతిని పట్టుకుని అతనికి దగ్గరగా తల ఆనించి ఏదో చెబుతోంది.

అతను కూడా ఆమెవైపే తలతిప్పి ఏదో చెబుతున్నాడు. అలా ప్రేమగా, ఆనందంగా కబుర్లు చెప్పుకుంటున్న జంటని చాలా రోజుల తర్వాత చూసింది సుధన్య! అందుల్లోనూ కుగ్రామమైన అవూర్లో.

కుగ్రామమైనప్పటికీ ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంతో రమణీయమైన ప్రకృతిని కలిగి మనసును ఉల్లాసపరచే ఊరది.




టి. సురేష్, బీయస్సీ, ఇంటి నెం. 4/502.ఎ. V రోడ్, అనంతపురం -515 004.

తన రాష్ట్రం కాదు. ఆ భాష తనకు తెలీదు. చుట్టూరా పచ్చని కొండలు. కొండలకు ఆనుకొని చిక్కని, చక్కని అరణ్యం, కొండల మధ్య చిన్న చిన్న జలపాతాలు - ఎక్కడో రవిశంకర్ సితార వాదనలా, మరోచోట ఉస్తాద్ అలీఖాన్ తబలా వాయిద్యంలా జలపాత ప్రవాహావళి, పక్షుల కిలకిలలు అడవి జంతువుల అరుపులు దగ్గర్లోనే వినిపిస్తూ ఉంటాయి. పరవశంతో పులకింపజేస్తూ ఉంటాయి.

వాగులూ, లోయలూ, వీటన్నింటి మధ్యా కాలిబాట, కాలిబాటకు ఇరుపక్కలాదేశవాళీ పెంకులుపేర్చిన ఇళ్ళు దూర దూరంగా అక్కడా, అక్కడా కనబడతాయి.

ప్రకృతి అందాలు పరవళ్ళు తొక్కేవేళ టూర్‌నుండి తిరిగి వచ్చేవాడు సుధన్య భర్త. వస్తూనే విసుక్కోవడం ప్రారంభించేవాడు. చిరాకు పడుతూనే వేడినీళ్ళ స్నానం పూర్తి చేసేవాడు. సుధన్య అమర్చిన భోజనాన్ని తిడుతూనే తినేవాడు.

"నీ కన్న ఆదివాసీ పనిమనిషి నయం. చక్కగా వండి పెట్టేది. అనవసరంగా చేసుకున్నాను పెళ్ళి" అనేవాడు.

పల్లెటూళ్ళల్లో ఇళ్ళకు వీధిలో వరండా, పెరట్లో వన్నాటకాక గది ఒక్కటే ఉంటుంది. అదే డ్రాయింగ్ రూం. డైనింగ్ రూం, బెడ్‌రూం వగైరా అన్నీని. మంచం కుర్చీగా చేసుకుని ఎదురుగా టేబిల్ మీద అమర్చి పెడితే టేబిల్ మీల్స్ చేసేవాడు సుధన్య భర్త.

కంచంలోనే చేతులు కడుక్కుని అలానే పక్కమీద వాలి పోయేవాడు. సుధన్య ఎంగిళ్ళు శుభ్రం చేసి వచ్చేసరికి అతని గురక వినిపించేది. దోమతెర వేసి అదే దోమతెరలో అతని పక్కనే పడుకునేది. పక్కనే పరువంతో ఉన్న పెళ్ళాన్ని పట్టించుకోకుండా గురకతీసే పతిదేవుని పక్కన పడుకుని, దుర్భర ఏకాంతం మధ్య నిద్రరాని రాత్రులలో అంతులేని ఆలోచనలమధ్య విలవిలలాడేది సుధన్య.

దాంపత్య సుఖంలేకపోయినా ఫరవాలేదు. రోజంతా ఎదురు తెన్నులు కాసి, అతనికి తన సర్వస్వాన్ని అర్పించిన భార్యకు కాసింత పలకరింపు, కాసింతస్నేహం, కాసింత ఓదార్పు చూసించని మగాడిని ఎన్నాళ్ళని నమ్ముకోవడం?

దాంప్య సుఖం అని దేన్నంటారో తనకు తెలీదు. ఏ పక్షానికో, నెలరోజులకో ఒకసారి, సుధన్య ఇష్టాఇష్టాలతో ప్రమేయం లేకుండా, మీదపడి, దౌర్జన్యంగా ఆక్రమించుకుని, కామంతో కళ్ళుమూసి, మరుక్షణం గురకపెట్టి నిద్రపోయేవాడితో దాంపత్యసుఖం అనుభవించిందని ఎవరైనా అంటే చీపురు తిరగేస్తాననంటుంది సుధన్య. దానిని బలాత్కారమో, మానభంగమో, లేక ఆ రెండూ కలిసిన హీనకార్యమో తప్ప దాంపత్య సుఖం కాదంటుంది.

తన మొదటిరాత్రి అనుభవం జ్ఞాపకానికి వచ్చింది సుధన్యకు. అత్తవారింట్లో తనను గదిలోకి నెట్టి తలుపు

వేసిన తర్వాత చాలాసేపటివరకు భర్త కాలేదు. తన భర్త గదిలో ఉన్నడనే అనుకుంది. పాలగ్లాసుతో అడుగుపెట్టిన సుధన్య.

లోనగది ఖాళీగా ఉంది. అర్ధరాత్రి దాటిందాకా తన భర్త కోసం ఎదురుచూపులు చూసింది. ఏంచేయాలో తెలియదు. కూచోవాలో, కూడదో తెలియదు. ఆ గదిలో పందిరి మంచం తప్ప మరో కుర్చీలేదు. ఆ మంచం మీద కూర్చోవచ్చో, లేదో, భర్తవచ్చాక, అతను కూర్చున్నాక తను కూర్చోవాలేమో, ఎంతకీ రాడేమిటి? ఎక్కడున్నాడతను?

క్షణ మొక యుగంగా, ప్రతీ నిముషం వేదనగా, గుబులుతో, భయంతో, ఎదురుచూస్తూ గడిపింది. నిద్రపోదామన్నంతలో తలుపు చప్పుడైంది. అతను వచ్చాడు. తలుపు తీసి మంచం మీద కూర్చున్నాడు "ఏయ్! ఇలారా!" అన్నాడు ఆశ్చర్యంతో ఉలిక్కిపడింది సుధన్య.

దగ్గరగా వెళ్ళింది. "ఈ... ఎందుకు తీసెయ్యి" అన్నాడు.

అవాక్కయింది. అతనికేసి చూసింది. నములుతున్న కిళ్ళీ వెనకాల నుండి విదేశీమద్యం వాసనలు గుప్పు మంటున్నాయి. తను జవాబివ్వలేదు. భర్తే ఆమెను పట్టిలాగి, మంచంమీద పడేసి, ఆక్రమించుకుని, మరో అయిదు నిముషాల్లో పక్కకు వొరిగి పడుకుని గుర్రు పెట్టాడు. సుధన్య ఏడ్చి ఏడ్చి మంచానికి ఆనుకుని ఎప్పుడో జారగిలబడి నిద్రపోయింది.

మర్నాడు జరిగిందంతా అమ్మకు చెప్పింది.

అమ్మ గుడ్లనీరు కక్కుకుంది. నోట్లో గుడ్డలు కుక్కుకుని శబ్దం బైటకు రాకుండా ఏడ్చింది. "మోసపోయామా తల్లీ! అందరూ మంచివాడన్నారే - అయ్యో! ఏ జన్మలో, ఏ పాపం చేశామో తల్లీ! తాగుబోతు మొగుడు పాలిట పడ్డావు. జాగ్రత్తమ్మా! నీ కాపురం జాగ్రత్త తెలివైన దానిని. జాగ్రత్తగా నీ కాపురం నిలబెట్టుకో. నాన్నగారు నీ పెళ్ళికోసం తొంభైవేలు ఖర్చు చేశారు. అప్పులెలా తీరుస్తామో తెలీదు. సర్దుకుపోవాలి తల్లీ! జీవితమంటే సర్దుబాటేనమ్మా! నీ అదృష్టం బాగుంటే అతనే మారాడు! నువ్వసలే తెంపరి దానివి. ఏం అఘాయిత్యం చేస్తావో భయంగా ఉంది. జాగ్రత్త" అని తనకు జాగ్రత్తలు చెప్పిపోయింది - నాన్నగారు ఇది తెలిసి ఏమీ అనలేదు..... వ్రాయలేదు.

తన సంసారం మొదటిరోజే ముక్కలయింది. అతికేందుకు తను చేసిన ప్రయత్నాలను పురుషహంకారం వమ్ముచేసింది.

తెల్లవారి లేచిన దగ్గర్నుండీ వంటచేసి పెట్టడం, చెమటకంపు, మద్యం కంపు కొడుతున్న అతని డ్రాయర్, బనీను, బట్టలు ఉతకడం, వేణీళ్ళస్నానం చేయించి, వేడివేడిగా భోజనం పెట్టి, అతనిలో హుషారు నింపి పంపడం, తను తెచ్చిన కట్నంతో విలాసంగా తిరిగే భర్త ఇంట్లో దాసీ దానిగా పడి వుండటం. అతనికి చేసిన సేవలకు ప్రతిఫలంగా జీతంలేని దాసీలా నాలుగు మెతుకులు మింగి బతకడం - ఇదేనా జీవితం?

ఇందుకేనా తన బ్రతుకు?

చదువుకున్న చదువు మర్చిపోయి, తెలివితేటల్ని అణగదొక్కుకుని, పనిమనిషిలా, మనసులేని మంం మనిషిలా మనసు చంపుకు గడపటమేనా తన పుట్టుకకి సార్థకత?

పని మనిషికి కూడా జీతం ఉంటుంది.

ఆమె పుట్టింటి నుండి కట్నంతో వచ్చి పని మనిషిగా చేరదు.

ఆమె కిష్టం లేకపోతే ఆమె శరీరాన్ని అబగా చూసే మగాణ్ణి చీపురుతో సంస్కరిస్తుంది.

మరి తనో...?

స్టేషన్లో ప్రయాణీకుల సందడి ప్రారంభమైంది. టికెట్ కౌంటరు తెరిచారు. నలుగురు తనను గుర్తించక మునుపే గబగబా వెళ్ళి టికెట్ తెచ్చుకుంది. తను తిన్నగా తాతగారింటికి వెళుతుంది. తన తాతగారు, అమ్మమ్మ తనస్నేహితురాళ్ళు నలుగురైదుగురు అక్కడ ఉన్నారు. వారి మధ్య కొన్ని రోజులు సేద తీర్చుకుని, వారి సహకారంతో ఏదో ఒక ఉద్యోగంలో స్థిరపడాలి. తన కాళ్ళమీద తను నిలబడ గలగాలి. తనకా నమ్మకం, ధైర్యం ఉన్నాయి. ఆ తరువాత -! ఆ తరువాత సంగతి అంత తేలికగా పరిష్కారమయ్యే వ్యవహారం కాదు. కట్టుకున్న వాడికి విడాకులివ్వడం, అంతకుముందే కట్నం డబ్బులు, సారెసామాను ముక్కుపిండి మరీ వసూలు చేయడం, ఇలా ఎన్నెన్నో......

పాసెంజరు రానే వచ్చింది. సుధన్య గబగబా రైలెక్కి కూర్చుంది. రైలెంతో సేపు ఆగదు.

అమ్మో! ఎవరా వస్తున్నది?

చెమటలు కక్కుకుంటూ, తెల్లచొక్కా, గోధుమ రంగుప్యాంటు, మెయిన్‌గేటు దాటి గబగబా ఇటే వస్తున్నాడు. ఆ కొస నుండి ప్రతి కంపార్టుమెంటు వెతుక్కుంటూ వస్తున్నాడు.

తన భర్తే - సందేహం లేదు.

సుధన్య ఇంట్లోలేని సంగతి తెలుసుకుని వచ్చారు. ట్రైనంతా గాభరాగా వెదుకుతున్నాడు.


"వస్తేరానీ, నాకేం!" అనుకుంది. ధైర్యంగా కూచుంది.

సుధన్య నిశ్చయం ఆమెలో ఆత్మవిశ్వాసాన్ని కరిగించింది.

రైలు కదిలింది. సుధన్య సరికొత్త జీవితానికి స్వాగతం పలుకుతున్నట్టుగా, చప్పట్లతో ఆహ్వానిస్తున్నట్టుగా, లయబద్ధంగా రైలు కదిలింది.

అప్పుడే, ఆ కంపార్టుమెంటు దగ్గరకు వచ్చి సుధన్యను చూసిన ఆమె భర్త ఆమె కళ్ళల్లోని వెలుగును చూసి అవాక్కయి, అచేతనంగా నిలబడిపోయాడు.


జి.ఆర్.ఎన్. ఠాగోర్
రాణిగుడ ఫార్మ్
రాయగడ - 765001.
ఒరిస్సా.


జి. రాజేష్, సన్నాఫ్. రామమూర్తి, గోల్డెన్ బడ్స్ స్కూల్, డోర్ నెం. 5/87 IV రోడ్, అనంతపూర్ - 505 004.